క్లుప్తంగా

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: జిల్లా స్థాయి అబాకస్ గణిత శాస్త్ర పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటారని మిల్టన్ పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. పోటీల్లో పాల్గొని విజయం సాధించి మొదటి బహుమతి గెలుచుకొన్న ముజామిల్, రెండవ బహుమతి గెలుచుకొన్న హిమవర్షకు మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేషులు, రంగస్వామి, ఉమర్ వలి, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి



రైతులతో మాట్లాడుతున్న చీఫ్ మేనేజర్ మహబూబ్ బాషా

కోసిగి: కేడీసీసీ బ్యాంక్ పరిధిలోని తీసుకున్న రుణాలు రైతులు సకాలంలో చెల్లించి అధిక వడ్డీ నుంచి ఉపశమనం పొందాలని ఆ బ్యాంక్ ఆదోని బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మహబూబ్ బాషా, హెడ్ ఆఫీసర్, రికవరీ టీమ్ చీఫ్ మేనేజర్ రాఘవేంద్రలు సూచించారు. మంగళవారం కోసిగి ఆర్లబండ సహకార సంఘం, బ్రాంచ్ పరిధిలోని మొండి బకాయిదారులైన రైతులను కలిసి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆదోని బ్యాంక్ పరిధిలో 10 సహకార పరపతి సంఘాలు ఉన్నట్లు తెలిపారు. రైతులు బ్యాంక్ పరిధిలో కంపోజిట్, ఎల్ఐ, ఇతర రుణాలు అందజేసినట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

గోనెగండ్ల : మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో మంగళవారం వసంత పంచమి సందర్భంగా అర్చకులు సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు తల్లిదండ్రులు, చిన్నారులచే సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేయించి, చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. 40 మంది దంపతుల పూజ కార్యక్రమంలో పాల్గొని తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతి శిశు మందిర్ నిర్వాహకులు, మాతాజీ నరసమ్మ, విజయ్ కుమార్, వినీతా, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలతో పాడి రైతులకు ప్రయోజనం

పెద్దకడబూరు: మినీ గోకులం షెడ్లు పాడి రైతులకు ఎంతోగానో ఉపయోగపడుతుందని ఏపీఓ ఖాదర్‌బాషా సూచించారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్ నిర్మాణాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం రూ. 2లక్షలతో గోకులం షెడ్‌ను నిర్మిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా ఉద్యోగులతో కలిసి ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతిపత్రాన్ని ఎంఈఓ ఆంజినేయులుకు అందజేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన



ధర్నా చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ విధానలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొనిరావడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మునెప్ప, నాగేంద్ర, రాఘవేంద్ర, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు ‘లోన్’ కావొద్దు

- పేట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
- హామీ లేని రుణాలంటూ వల
- ఆన్‌లైన్ గేమింగ్‌తో మోసాలు
- ఎక్కువగా మోసపోతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



గోనెగండ్లలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

☛ గోనెగండ్లకు చెందిన ఓ మాజీ సైనికుడి ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం లోన్ యాప్ లింక్ వచ్చింది. ఆ సైనికుడు లోన్ కోసం ఆ లింక్‌ను ఓపెన్ చేయగా అకౌంట్లో ఉన్న రూ.3లక్షల నగదు కాజేశారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న సైనికుడు గోనెగండ్ల పోలీసులను ఆశ్రయించాడు.

☛ మండలంలోని హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన వ్యక్తికి (గతేడాది ఆగస్టు నెలలో) అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి నాకు రూ.50వేలు గూగుల్ పే చేయండి, మీకు నగదు చేతికి అందిస్తాను, మీకు నమ్మకం లేకపోతే నేను గోనెగండ్ల పోలీస్ స్టేషన్ దగ్గరే ఉన్నాను, మీరు వచ్చిన వెంటనే నగదు ఇస్తానని చెప్పాడు. వారిని నమ్మిన సదరు వ్యక్తి రూ.50వేల నగదును ట్రాన్స్‌ఫర్ చేశాడు. అక్కడికి వెళ్లి చూడగా ఎవరూ కనిపించలేదు. విచారించిన తరువాత మోసపోయానని తెలుసుకొని పోలీసులను ఆశ్రయించాడు.

☛ ఒంటెదుదిన్నె గ్రామానికి చెందిన ఓ యువకుడి ఫోన్‌కు జనవరి నెలలో టెలిగ్రామ్‌లో లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి అందులో వస్తున్న ఆన్‌లైన్ గేమ్‌కు కొంత నగదును చెల్లించి గేమ్ ఆడుతున్నాడు. ముందుగా పెట్టిన నగదుకు డబుల్ అమౌంట్ వచ్చింది. ఇంకా ఎక్కువ పెడితే ఇంకా రెట్టింపు వస్తాయని భావించి రూ.5వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలా దాదాపు రూ.25వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. రెట్టింపు నగదు రాకపోగా ఉన్న డబ్బు పోగొట్టుకున్నాడు. చివరకు మోసపోయానని తెలుసుకున్న ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇలా వీళ్లు మాత్రమేకాదు.. చాలా మంది ఈజీగా లోన్ వస్తుందని, డబ్బు సంపాదించవచ్చని నమ్మి ఆన్‌లైన్‌లో ఉన్నడబ్బును పోగుట్టుకుంటున్నారు.

గోనెగండ్ల: సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాల్లో గాడి తప్పుతోంది. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ సాంకేతికత అనేక సందర్భాల్లో నిట్టనిలువునా ముంచుతోంది. ప్రజల అవసరాలను, వారి బలహీనతలను ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. చాలా మంది లోన్ యాప్ నిర్వాహకుల వలలో పడి అవస్థలు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడితే డబ్బులు వస్తాయనే మోజులో పడి నగదు పోగొట్టుకొని అవస్థలు పడుతున్న వారు కూడా ఉన్నారు. చాలా మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మదనపడుతున్నారు.

ఫోన్లలో మభ్యపెట్టి..

మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారు.. అంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. ఇదేదో ఒకసారి చూస్తే పోలా అనుకుని వివరాలు చెబితే చాలు.. రుణం తీసుకునే వరకూ ఫోన్ చేసి, ఏదో విధంగా ఒప్పించి రుణాన్ని తీసుకునేందుకు మభ్య పెడుతున్నారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే, వడ్డీపై వడ్డీవేసి, రుణం సొమ్ము నుంచే ముందుగానే కొంత మినహాయించి ఇస్తున్నారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో ఇలా చాలా మంది బాధితులు లోన్ యాప్ సంఘటనకు గురై ఎవరికీ చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారు.

వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్ది వేధింపులు తీవ్రతరమవుతాయి. రుణగ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫోటోలు పంపుతారు. బెదిరింపులకు లెక్కచేయకపోతే రుణ గ్రహీత కుటుంబ సభ్యుల ఫోటోలను మార్ఫింగ్ చేసి రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సాప్ పంపుతారు. వీరి ఆగడాలను కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇలాంటి యాప్‌ల నిర్వహకులు గ్రామీణ ప్రాంతాలను ఎంచుకుంటారు.

ఒక్క క్లిక్‌తో..

మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ యాప్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఎటువంటి హామీ లేదనడంతో యువకులు, సామాన్య ప్రజలు ఈ కల్లబొల్లి మాటలకు ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్‌ల వలలో చిక్కితే బయటపడడం అసాధ్యంగా పరిణమిస్తోంది.

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ మోసాలు రోజు రోజుకు పెరుగుతుండడంతో సైబర్ నేరాల నుంచి ప్రజలను రక్షించేందుకు పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పలు జాగ్రత్తలను సూచిస్తున్నారు.

☛ అపరిచితుల ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయరాదు.
☛ లోన్ యాప్‌లను నమ్మరాదు, వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదు.
☛ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వీడియో కాల్స్ లిఫ్ట్ చేయకూడదు.
☛ ఫోన్‌కు లేదా, వాట్సాప్‌కు ఎవైనా లింక్స్ వస్తే వాటిని ఓపెన్ చేయొద్దు.
☛ ఫెక్ ప్రొఫైల్స్ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మీ బంధువుల, స్నేహితుల ఫోటోలతో ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసి మిమ్మల్ని డబ్బులు అడుగుతారు, ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలి. ఇలా పలు రకాలుగా మోసచేస్తున్నారని సైబర్ నేరాలకు మోసపావద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
☛ సైబర్ నేరాలపై ఫిర్యాదు కొరకు 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పండని అడిగితే జాగ్రత్తపడాలి. అపరిచిత వ్యక్తుల ఫోన్‌లకు సమాధానం ఇవ్వకూడదు. ప్రతి యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణ యాప్‌ల్లో అప్పులు తీసుకుని మోసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశపడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రుణ యాప్ నిర్వహకుల నుంచి వేధింపులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి. – ఏ. గంగాధర్, సీఐ, గోనెగండ్ల

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ కళ్యాణి

గోనెగండ్ల: రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ కళ్యాణి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మండల కేంద్రంలో జరుగుతున్న రీ సర్వేను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్, వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. సర్వేలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, రీ సర్వే డీటీ శిరీష, మండల సర్వేయర్ అబ్దుల్ హమీద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

లక్షల డప్పులతో ‘చలో హైదరాబాద్’



డప్పులతో ప్రచారం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య

ఎమ్మిగనూరుటౌన్: ఎస్సీ వర్గీకరణకై లక్షల డప్పులు వేలాది గొంతులతో ఈనెల7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య, జిల్లా ఉపాధ్యక్షులు గంజిహళ్లి మహదేవ్ పిలుపునిచ్చారు. మంగళవారం డప్పు వాయిద్యం వాయిస్తూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రదర్శనతో ఎస్సీ వర్గీకరణపై ప్రచారం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వారికి డప్పుల మోతతో తమ నినాదాన్ని తెలియజేయనున్నామని తెలిపారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: ఈ నెల 7న చలో హైదరాబాద్‌కు అధిక సంఖ్యలో మాదిగలు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎంపీ యువరాజు మాదిగ, సతీష్ మాదిగ, జిల్లా నాయకుడు శాంతిరాజు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ముక్కరన్న, అర్లప్ప, అనిల్, రోగెన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామక్కమ్మ అవ్వ విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన విగ్రహాలకు పూజలు చేస్తున్న ప్రహల్లాదాచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని కామవరం రస్తాలో వెలసిన రామక్కమ్మ అవ్వ దేవాలయంలో రామక్కమ్మ అవ్వ నూతన విగ్రహాలను వేదపండితుల వేదమంత్రోచ్చరణల మధ్య మంగళవారం ప్రతిష్టించారు. పాత దేవాలయాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ చేశారు. ఈ దేవాలయంలో రామక్కమ్మ అవ్వ విగ్రహాల ప్రతిష్ట కోసం రెండు రోజుల నుంచి వివిధ పూజా కార్యక్రమాలను చేపట్టారు, మంగళవారం ఉదయం నుంచి గ్రామ పూర విధుల గుండా విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించి భక్తుల కోలహాలం మధ్య ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహల్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు అవతారం, ఉమపతి, నాయకులు పాల్గొన్నారు.

ఓహెచ్‌ఎస్‌ఆర్‌కు మరమ్మతులు చేయించాలి

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని లక్ష్మీపేటలో ఉన్న ఓహెచ్‌ఎస్‌ఆర్‌కు మరమ్మతులు చేయించాలని, లేకపోతే ఇతర ప్రదేశానికి మార్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట రైతుసంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఓహెచ్‌ఎస్‌ఆర్ నిర్మాణం చేపట్టి 30సంవత్సరాలకు పైగా అయ్యిందన్నారు. ప్రస్తుతం అందులోని ఇనుప కడ్డీలు బయటపడి కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ నాగరాజుస్వామికి సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, వీరాంజినేయులుగౌడ్, తిక్కన్న, గిడ్డయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: రథ సప్తమి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయా వైష్ణవ దేవాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుమలనగర్‌లో వెలిసిన శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం ఆలయ మేనేజర్ ఈరన్న ఆధ్వర్యంలో కమనీయంగా జరిగింది. భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వేద పండితులు కల్యాణం జరిపించారు. అదేవిధంగా సూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారికి రథ సప్తమి వేడుకల్లో భాగంగా మంగళవారం కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, వడలహారం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సూర్యనారాయణస్వామి, రణమండల ఆంజనేయస్వామి అష్టోత్తరం చేశారు.

9న మెగా వైద్య శిబిరం

ఆదోని అర్బన్: పట్టణంలో ఈనెల 9వ తేదీన వాసవీ కల్యాణ మండపంలో ప్రముఖ ఎన్నారై కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదోని అవోపా అధ్యక్షుడు వంకదారి శ్రీనాథ్‌గుప్త తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మెగా వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వైద్యశిబిరంలో 15 మంది డాక్టర్లు, 35 మంది సిబ్బందితో మూడు పెద్ద ఆసుపత్రుల సహకారంతో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వారి(అవోపా), వామ్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైమ్ ప్లస్ కర్నూలు, నంద్యాల శాంతిరామ్, మేధు ఆసుపత్రి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇందులో ఉచిత సంతాన సాఫల్య, కంటి ఆపరేషన్లు, గొంతు, ముక్కు, చెవి సంబంధించిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ అవోపా మరియు వామ్ సెక్రటరీ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మఖ్దూం మొహియుద్దీన్ జయంతి

ఆదోని సెంట్రల్: ఎస్టీయూ రూపకర్త, పోరాట యోధుడు మఖ్దూం మొహియుద్దీన్ జయంతిని ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్టీయూ సహధ్యక్షులు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విగ్రహ ప్రతిష్టాపన పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య కులబాంధవులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెంలో ఆర్యవైశ్యకులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టాపన పూజలు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇల్లూరి శ్రీనివాస శెట్టి, ఉపాధ్యక్షులు ఇల్లూరి ఆదినారాయణ శెట్టిల ఆధ్వర్యంలో బాలాజీ శర్మ వేద పండితులు నేతృత్వంలో భక్తులు హోమాలు, చండిపారాయణం, జపాలు చేపట్టారు. బుధ, గురు వారాల్లో విశేష పూజలు చేపట్టి ఈనెల 7న ఆలయంలో వాసవి కన్యకపరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టాపన చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపనకు మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, బెంగళూరు శ్రీ వాసవీ పీఠము-2 పీఠాధిపతి ఆర్యవైశ్య కులగురువులు సచిదానంద సరస్వతి మహాస్వామిజీ, వివిధ ప్రాంతాల నుంచి ఆర్యవైశ్య సంఘం పెద్దలు, కులబాంధవులు హాజరవుతారని చెప్పారు.

ఘనంగా ఆలయ 10వ వార్షికోత్సవం



నీలకంఠేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గోనెగండ్ల : మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలో వెలసిన కాశీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అర్చకులు సాగర్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామి వారి నిర్మలాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం, అలంకరణ తదితర పూజలు జరిపించారు. అనంతరం పార్వతీదేవి, కాశీనీలకంఠేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరిపించి స్వామి వారి పల్లకోత్సవం నిర్వహించారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలకు సంబంధిత లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చారే కానీ ఆయా ఇళ్లకు సంబంధించి తాళాలను అప్పగించి వారికి స్వాధీన పరచాలేని సీపీఐ పట్టణ నాయకులు రంగన్న , కేసీ జబ్బార్ డిమాండ్ చేశారు. టిడ్కో లబ్ధిదారులతో కలిసి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆయా గృహ సముదాయాల వద్ద కనీస మౌలిక సదుపాయాలైన మంచినీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. స్పందించిన కమిషనర్ లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు ఇవ్వాలని వార్డు సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు మైబున్, హసీనా, అబ్దుల్లా, రఫీక్, సిపిఐ నాయకులు విజయేంద్ర, ఖాజ,రంజాన్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

ఆదోని టౌన్: పట్టణంలోని అన్న క్యాంటీన్‌లను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. పాత బస్టాండు సర్కిల్‌లోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి.. టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల ఏర్పాట్లు, భోజనాలు రుచికరంగా ఉన్నాయా లేదాని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, టిఫిన్‌లో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం 32, 39 వార్డుల పరిధిలోని టీజీఎల్ కాలనీ, శానిటేషన్ పనులను పరిశీలించారు. 40వ వార్డు కిలిచినపేట, 2వ వార్డు బాపూజీపేట, మరాఠీగేరి, వాల్మీకినగర్, కౌడల్‌పేట, అరుంజ్యోతినగర్, గోకారిజెండా, తిక్కస్వామి దర్గా, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. వేకువజాము నుంచే జరుగుతున్న పూడికతీత పనులు, చెత్తకుప్పల తొలగింపు తదితర పనులను పరిశీలించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ఉండాలి

ఆదోని సెంట్రల్: కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్. షేహనాజ్ బేగం తెలిపారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేకుండా ఉన్న మచ్చలు, చెవిపై బుడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మర్లు పట్టడం, కనుబోమలు వెంట్రుకలు పలుచపడిపోవడం తదితర లక్షణాలు ఉంటే డాక్టర్లను సంప్రదించాలన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పార్క్‌లను అభివృద్ధి చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌తో పాటు పెద్ద పార్క్ తదితర ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. పార్కులను అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామ కంఠంలో మినీ గోకులం

- ప్రభుత్వ భూమిని కాజేసేందుకు టీడీపీ నాయకుడి పన్నాగం
- గ్రామకంఠం భూమిలో మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి శ్రీకారం
- స్థలాన్ని ఆలయానికి అప్పగించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయం వెనుక స్థలంలో మినీ గోలం నిర్మాణం



పునాదులుతవ్విన దృశ్యం

నందవరం: గతంలో ‘నీరు– చెట్టు’ పథకంతో తెలుగు తమ్ముళ్లు రూ.కోట్లు కూడ బెట్టుకోగా ప్రస్తుతం మినీ గోలాలు సైతం వారి దరికే చేరాయి. అయితే ఈ సారి ఓ తమ్ముడు ఒక అడుగు ముందుకు వేశాడు. తన వాటాకు వచ్చిన మినీ గోకులాన్ని తన సొంత స్థలంలో కాకుండా గ్రామ కంఠం భూమిలో నిర్మించేందుకు శ్రీకారం చూట్టాడు. రూ.లక్షల విలువైన గ్రామ కంఠం భూమిని మినీ గోకులంతో సొంతం చేసుకోవాలని పన్నాగం పన్నాడు. వివరాలు ఇవి.. నందవరం మండల పరిధిలోని గురజాల గ్రామంలోని సర్వే నెంబర్ 132లో ఉన్న గ్రామ కంఠం భూమి దాదాపు 5.50 ఎకరాలు ఉంది. అందులో రామలింగేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని తనదే నంటూ ఓ టీడీపీ నాయకుడు అక్కడ మినీ గోకులం నిర్మాణం చేపట్టాడు. ఆ ఖాళీ స్థలంలో రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలల్లో అంగళ్లు ఏర్పాటు చేసేవారు. దీంతో ఆలయానికి ఆదాయం కూడా వచ్చేది. ఆ స్థలంలో 10 సంవత్సరాల క్రితం మినీ వాటర్ ట్యాంకు ఉండేది. ఆలయానికి వచ్చిన భక్తులు అక్కడ కాళ్లు, చేతులు కడుక్కొని దైవ దర్శనానికి వెళ్లేవారు. తుంగభద్ర పుష్కరాల్లో ఆలయానికి నూతన దారి వేయడంతో ఆ స్థలంలో వాటర్ ట్యాంకును తొలగించారు. అప్పటి నుంచి స్థలం ఖాళీగా ఉంది. ఉన్నత అధికారులు గురజాల గ్రామాన్ని సందర్శించి గ్రామ కంఠం భూమిలో అక్రమంగా నిర్మించే మినీ గోలకులం నిర్మాణాన్ని నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ స్థలాన్ని పరిశీలించి ఆలయ అభివృద్ధికి ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.